
ఊరవతల ఊడల మర్రి నీడన బండమీద నేను... పోయిన ప్రేమను తడుముకుంటున్నాను. నిన్నటి జ్ఞాపకం నేడు వెన్నంటి ఉండగా గుండె బరువుతో కోల్పోయిన స్మృతిని కెలుక్కుంటున్నాను.

# ప్రేమకోసం

-చైతన్యప్రకాశ్



నా మనను పదే పదే ఆమెనే పలవరిస్తోంది! ఎందుకని? ఏమో! రాత్రిళ్ళు ధారావాహిక ఆలోచన... ఆమెనే కలవరిస్తోంది! ఆమె సాహచర్యాన్ని స్వప్నిస్తుంది! ఏమిటిదంతా? ప్రశ్నలకు జవాబుందా? ఉంటే ఏమిటది? ఏమో చెప్పలేను. అంత అనమగ్రం. అనమర్థతా అనహనం.

అనంతానంత సంధిగ్ధావస్థ. ఆమెను చూడకుండా ఉండలేను. ఎక్కడ కూర్చున్నా ఎవ్వరితో మాట్లాడాలనిపించదు. ఏమీ చేయాలనిపించదు. ఇలా ఎందుకవుతుంది? నా మనస్సు నెవరు నిర్దేశిస్తున్నారు? మిత్రులతో కూర్చున్నా దేశ రాజకీయాల గురించి మాట్లాడుతున్నా మరేది చేస్తున్నా ఆమె గురించిన నీడల జాడలు మనస్సుపై సాలీడు శ్లేష్మాల్లా అల్లుకుపొయ్యాయి. దాన్లో పడి రేయింబవళ్ళు తన్నుకుచస్తున్నాను. నేనేం చేయాలో నాకెవరు చెప్పాలి?

బహుశా... ఆమె గూడా నాలాగే కావచ్చు!

మొదట ఆమె నేత్రాలే నిఘంటువులై నన్నూ నా మనస్సును చప్పరించాయి. నన్ను బహుభాషా కోవిదుణ్ణి గాదు గానీ, ప్రేమ భాషా లిపిని చూపి అనుబంధాన్ని అలవోకగా ఎత్తి చూపినాయి.

నాజూకుగా, మృదువుగా వెడల్పాటి భృకుటి, నవ్వులు తాండవమాడే వెన్నెల ముఖవర్చస్సు, నన్ను తన అదుపులో ఉంచుకునేంత హుందా

రోజూ నా ఆరోగ్యం బేరీజు వేస్తుండేది. నా ఆకలి దప్పుల గురించి ఆలోచిస్తుండేది. నేను తిరుగాడే మిత్రుల్ని గూడా ఓ కంట కనిపెడ్తూ ఏవేవో నలహాల్లాటివి చెప్తుండేది. పేలవంగా ఈదుతున్న బతుకుని అర్థవమయం చేసిన ఆమెను తలచుకోటం పెద్ద వృత్తిగా మారిందేమో?

ఓస్... ప్రేమంటే ఇంతేనా?


అంటే.... నా కోసం నా రక్షణ కోసం, నా చుట్టూ పరిచర్యల కోసం నా దుఃఖాల కోసం ఎదుటి వార్ని కష్టపెట్టి వార్నించి సుఖం కోరుతున్నానన్నమాట-

ఇంత పెద్ద స్వార్థం పునాదిపై ప్రేమ నిలబడి ఉందా? ఇలా లోతుల్లోకి పోయి మనను పాడుచేసుకోవడం బాగలేదు. వాళ్ళ వాళ్ళ కష్టాల కోసం మనం మన దరిజేర్చుకొని ఓదార్పు ఇవ్వటంలో ఔదార్యం ఉంటుంది కానీ... వేడుకోగా వరమిచ్చిన దేవతనే దాస్యం చేయమన్నట్లు ఇదేమంత బాగలేదు.

ఏదేమైతేనేం నాకామె కావాలి?

క్షయ వ్యాధితో పోయిన నాన్న నాకేమివ్వలేదు. వృద్ధాప్యంతో మిణుక్కు మిణుక్కుమంటున్న అవ్వ నాకేమివ్వలేదు. వదినె ఎవరితోనో లేచిపోగా పిచ్చి పిచ్చిగా మిగిలిన అన్నయ్య నాకేమిస్తాడు? చిత్తు బొత్తుగా నాణేల్లో నలిగిపోయిన నా సాహితీ పరిజ్ఞానం నాకేమిచ్చినట్లు లేదు. చిల్లరక్కొరగానీ డిగ్రీలు నాకేమివ్వలేదు. నాకివ్వటం కోసం ఇవేవి ఉన్నట్టు లేదు.

తల్లి దండ్రులు జన్మనిచ్చారు అదే పదివేలు. చదివిన చదువులన్నీ బజారుకీడ్చి బతుకేమిటో తూచి తూచి చెప్పినాయి.




అదే.... అదే....

కడివెడు కన్నీళ్ళతో మిగిల్చుకున్న సంతోషం. నన్ను సుఖపెట్టడం కోసం ఏవేవో ఉన్నాయనుకోవటం పెద్ద పొరపాటులాగుంది.

పరిశీలనగా చూస్తే ఆమె కూడా నాకేమిచ్చింది...? ఏమో....?

నన్నో దేశద్రోహిలా వెంటాడి వేటాడి బజారు వ్యక్తిగా పోలీసులు తరిమినపుడు నన్నో నెలపాటు ఒక అరలో బంధించి సకల సపర్యలు చేసి రక్షించింది, కొండంత ధైర్యాన్నిచ్చి వెల లేని అనురాగాన్నిచ్చింది.

కానీ....

దేశానికీ ప్రజలకూ నేనేదో నేరం చేసినట్టు నాకనిపించటం లేదు.

దేశమంటేనే పేదవాళ్ళు

పేదవాళ్ళే ప్రజలు అనే అర్థంలో నేను చూట్టం ఈ చట్టాలకీ స్మగ్లింగ్‌కి మించిన దేశ ద్రోహం లాగనుపించిందేమో?

అసలైన దేశద్రోహుల్ని వదిలి నాలాటి వాళ్ళని జైల్లో త్రోసి లక్క పురుగులు లుకలుకలాడే తిండి మేపుతూ దేశ దరిద్ర్యాన్నీ, ప్రభుత్వ అవినీతిని నిర్దేశించి నిలేసి వేలెత్తి చెవుతున్నట్టనిపించింది.

ఇంతటి విషమ పరిస్థితిలో కూడా ఆమె నాతో ఉండటం యోగ్యమైన భాషలో అర్థాంగి అంటారేమో?

మరి...

వ్యవస్థీకరించిన వైవాహిక లైసెన్స్ లేదే...!?

లేకపోతే.... అక్రమ సంబంధం కిందే లెక్క! అక్రమ సంబంధం? సక్రమ సంబంధం?

''నిజానికి దాంపత్యాలన్నీ బలవంతంగా జరుగుతున్న అత్యాచారాలే'' సెలవిచ్చింది ఏ మహానుభావుడో?

అడవిలో మసైపోయిన వాళ్ళన్నయ్యను తలచుకొని వాళ్ళవ్వ ఏడ్చేడ్చి, కనలి కనలి మంచం పట్టి కానరాని రాజ్యంలోకి కనుమరుగైపోయింది. ఇకపోతే... వాళ్ళయ్య ఉన్న ఆ కొద్ది ఆస్తుల్ని తాకట్టు పెట్టి తాగుడులో మునిగి ఊరి పెద్దోడి వసారాలో ఊడిగమే జీవితంగా మిగుల్చుకున్నాడు.

ఆమె స్వయాన శ్రద్ధగా, బలవంతంగా అప్పుడెప్పుడో వాళ్ళన్నయ్య ప్రోద్బలంతో చదివింది అయిదవది.

పెళ్ళి వయసు దాటుతున్నా

అందరికీ పెళ్ళవ్వాలనేముంది?

ఉద్యోగ వేటలో అలసిపోయి, పట్నం రక్కసి రాజకీయ కలుషిత కోరల్నుంచి, ప్రేమ రాహిత్యం నుంచి బయట పడి పల్లె తల్లి ఒడిలోకి చేరుకున్నాను.

ఆ తర్వాత.... మిణుక్కు మిణుక్కుమనె ఆ అవ్వ పోయింది.

విరహమెరుగక బీడీలు చేసే ఆమె నాకిప్పుడు పెద్దదిక్కు.

ఆమె గూడే, ఆమె తోడే

నా కూడూ నా గోడూ నా నీడ-

ఎంతగా ఆకాశంలో విహరిస్తే మాత్రం ఆకాశంలోనే ఉండలేంకదా!

సహజసిద్ధమయిన నగటు మనిషి పేదరికం నాకూ దాపురించింది. నన్ను కన్న నేలయి నన్ను హత్తుకుంది.

ఈ మధ్య ఆరోగ్యమదోలా ఉందని ప్రతిరోజు ఆర్.ఎం.పి. డాక్టర్ దగ్గరికి పోతుంది.

ఆమె ఆరోగ్యం గురించి నాకు బెంగగా ఉంది.

★ ★ ★

ఉదయం లేచేసరికి

గుడిసె వాసాలకి వేలాడుతున్న మా ఆవిడ్ని చూసి, ఆ తర్వాత... నాకేం జరిగిందో తెల్వదు.

కొంచెం నిమ్మళం అయిన తర్వాత తెల్సింది. అనారోగ్య పరిస్థితిలో పోయిన తనని బలవంతపెట్టి డాక్టర్ రోజూ అఘాయిత్యానికి పాల్పడుతుండే వాడట. తద్వారా ఆరోగ్యం మరింత నీరసించి, మూణ్ణెల్ల గర్భం వచ్చిందట పరిస్థితి చేయిదాటిపోయినందున

తెలిస్తే నా నుంచొచ్చే ఆగ్రహాన్నూహించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్టు...

వచ్చీ రానీ రాతలో పడేసిన చీటీ సారాంశం.

ఆ తర్వాత మా గ్రామస్థులు మోతుబరి అయిన డాక్టర్ని క్షమించడం మనల్ని మనం క్షమించుకోవడమే నన్నారు.

పోస్టుమార్టమ్ లేకుండానే తతంగమంత అయిపోయింది.

నేను నేను కాకుండా పోయాను

నన్ను దహిస్తున్న నేల-

నా తల్లి నేల... నా పల్లె నేల ఇపుడు సమష్టి విలువల్లో కోల్పోయిన నా జాడ నాకు కావాలి?!

కోల్పోయిన నా ఆచూకి ఏది?

మర్రి నీడ నన్నెపుడో దాటింది.

బండ సుర్రున కాల్తుంది!

సూర్యుని ఎండ తీవ్రమయింది. ఒక్క ఉదుటున వీచిన గాలికి మర్రి ఊడ వీపుని చరిచింది.

●